డియర్ ఉషా!

ఈపాటికి నా గురించి విని, జీవితంతో ప్రయోగంచేసిన ఫూల్ అని భావించి నవ్వుకుంటున్నావా? నా గురించి ఎవరేమనుకున్నా, నువ్వు మాత్రం తేలిగ్గా భావించవని నాకెందుకో నమ్మకం. జీవితంతో నేను చేసిన ప్రయోగం నీ భవిష్యత్ నిర్ణయాలలో నీకు తోడ్పడవచ్చునేమోనని ప్రత్యేకించి రాస్తున్నాను.

# క్రాస్ రోడ్స్

వైశాలి & డి.ఆర్. ఇంద్ర

గుర్తుందా? మన స్నేహితురాలి అక్క వరకట్న సమస్యతో ప్రాణాలు తీసుకోవడం, దానికి స్పందించి మన కాలేజీలో ఆర్గురం–"కట్నం ఇచ్చి మొగుడ్ని కొనుక్కోం" అని ప్రతిజ్ఞచేసి "గ్రూప్ ఆఫ్ రెబల్స్"గా ముద్ర వేయించుకున్నాం. అలా ప్రతిజ్ఞ చేసిన కొత్తలో చాలామంది మనల్ని చూసి "ఆదర్శ మహిళలొస్తున్నార్రోయ్!" అని వెటకారాలాడటం; వాళ్ళకి మనం కాల్చి వాత పెట్టినట్టు సమాధానాలివ్వడం నువ్వు మరచిపోలేదనుకుంటాను. ఆ అరడజను మందిలోనూ ఇప్పటికి నల్గురు చేసిన ప్రతిజ్ఞమాటే ఎత్తకుండా, డిమాండ్ చేసిన కట్నాలిచ్చి పెళ్ళిళ్ళు చేసుకుని కాపురాలు చేసుకుంటున్న సంగతి నీకు తెలుసుగా. మాట తప్పారనీ, సిగ్గూశరం లేనివాళ్ళనీ నేను ఆగ్రహించి, వాళ్ళ పెళ్ళిళ్ళకి వెళ్ళకపోవడం; 'పోనిద్దూ, ఆమాత్రం దానికి స్నేహాలను కాలదన్నుకోవడం ఎందుకూ?' అంటూ నువ్వు వెళ్ళటమూ గుర్తు ఉందిగా? వేలూ, లక్షలూ కట్నంగా ఇచ్చి, తననూ ఇచ్చుకుని, తనదంటూ ఒక వ్యక్తిత్వంలేనివాడ్ని, వెన్నెముక లేనివాడ్ని తన భర్తగా ఉండమని ప్రాధేయపడే ఈ (కా)లేజీ ఆడపిల్లల్ని చూసి జాలిబడులు అసహ్యం వెయ్యడం లేదూ? వివాహాన్ని వ్యాపార స్థాయికి దిగజార్చడంలో మగాడితోబాటు ఆడపిల్ల కూడా సమాన పాత్ర వహించడం లేదూ? ఇంక మన రెబల్ గ్రూప్‌లో మిగిలింది నేనూ, నువ్వూ.

నా డిగ్రీ అయ్యాక నాకు సోషియాలజీలో ఎమ్మే చేయాలని వుండేది. కానీ, నేను పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తే, ఇంకా ఎక్కువ కట్నంతో ఎక్కువ స్థాయి మొగుడ్ని తేవాల్సి వస్తుందనే భయంతో, ఇంక చదవడానికి వీల్లేదనేసారు మావాళ్ళు! నాకోర్కెని చంపుకోలేకా, గోళ్ళు గిల్లుకుంటూ ఖాళీగా కూర్చోలేకా, బ్యాంక్ పరీక్షలు వ్రాసి, మెరిట్‌లో సెలక్టయి, ఉద్యోగం సంపాదించుకున్న సంగతి నీకు తెలుసుగా. నేనెవరినీ ప్రేమించెడంగానీ, ఎవరి ప్రేమవలలోనూ పడటంగానీ చెయ్యలేదు. అందుకే మావాళ్ళు నాకు సంబంధాలు చూస్తున్నా, నేనడ్డు చెప్పలేదు. అడ్డు చెప్పిందల్లా కట్నం ఇవ్వడానికి మాత్రమే. ఆ ఒక్క చిన్న విషయం, ఆత్మాభిమానంతో కూడిన చిన్న చర్య, చిన్న ఆదర్శం నా జీవితాన్నే మార్చేసింది. అప్పటిదాకా అందరాడపిల్లల్లాగే అన్నిరకాల వివక్షలకూ లోనవుతూ కూడా ఎప్పుడూ నోరెత్తకుండా సర్దుకుపోతూ వచ్చిన దాననే. ఈ విషయంలో మాత్రం అలా చెయ్యలేక పోయాను.

నన్ను చూడటానికి సాయంత్రం పెళ్ళికొడుకు వస్తాడని అమ్మ, అన్నయ్య చెప్పినపుడు – "కట్నం తీసుకుంటాడా?" అనడిగాను.

"ఆ నిక్షేపంలా. వద్దనడానికి అతనికేమైనా కన్నొంకరా, కాలొంకరా? పెళ్ళికొడుకుల మార్కెట్లో అతని రేటు లక్షన్నర దాకా ఉంది. నీ ఫోటో చూపించాను. నచ్చావు కాబట్టే బ్యాంక్ జాబ్ చేస్తున్నావు కాబట్టీ నిన్ను చూస్తే లక్షకే ఒప్పుకోవచ్చని ఆశ పడుతున్నాం" అన్నాడు అన్నయ్య.

"అతను రానవసరం లేదు. నా క్కావల్సింది నాతో జీవితం పంచుకోవడానికి డబ్బడిగే మగ ప్రాస్టిట్యూట్ కాదు" అన్నాను. ప్రశాంతంగా ఉన్న ఇంట్లో తుఫాన్ చెలరేగటానికి అది చాలు.

మామూలుగా కొనుగోలుదారుడే అమ్మబడే వస్తువు నవ్యంగా, నాణ్యంగా ఉందో లేదోనని పరిశీలిస్తాడు. కానీ ఈ నర పశువుల మార్కెట్లో మాత్రం అమ్మబడే పశువే తనని కొనుక్కునే యజమానురాలినే నఖశిఖ పర్యంతం పరీక్షించడం వింతలోకెల్ల వింత కాదూ? ఆ మాటే పైకన్నాను.

"అహా! ఐతే ఇంతకీ ఏమంటావ్? నీకోసం కట్నం లేకుండా చేసుకునేవాడు పుట్టుకురావాలి! ఏదో లక్కీగా ఉద్యోగం వస్తే దాన్ని చూసుకుని పెద్ద కొమ్ములే మొలుచుకొచ్చాయే!" వదిన్ని ప్రేమించి కూడా, పెళ్ళి దగ్గరకొచ్చేసరికి గిరిగీసి బేరాలాడి, పెద్ద మొత్తమే పుచ్చుకున్న అన్నయ్య వెటకారంగా అన్నాడు. అన్నయ్య వెనక నుంచున్న వదిన నేనొక వింత జంతువుని ఐనట్టు చూస్తోంది.

"నీకు నచ్చిన అమ్మాయిని చేసుకుందుకు మగాడిగా నీకు స్వేచ్ఛ ఉన్నపుడు–కట్నం పుచ్చుకునేవాడు నాకు వద్దనే స్వాతంత్ర్యం ఆడపిల్లగా నాకు లేదా?" అన్నాను.

"అదేవిటే, మగాడు అన్నయ్యా నువ్వూ సమానమా? పెళ్ళివిషయంలో స్వతంత్రించడం మన ఇంటావంటా లేదు. నీ చదువు నీ స్వేచ్ఛకి దారి తీస్తుందనుకుంటే అసలు హైస్కూల్‌తోటే ఆపించేసేవాళ్ళం" అంది అమ్మ.

"ఆడవాళ్ళ చదువు తప్పనిసరిగా స్వేచ్ఛకు దారి తీయదమ్మా. చదువే స్వేచ్ఛకి దారితీస్తే లోకంలో చదువుకున్న ఆడవాళ్ళందరూ మగాళ్ళలాగే స్వేచ్ఛగా బతుకుతూండాలిగా. మగాళ్ళతో సమానంగానూ, ఒక్కోచోట అంతకన్న ఎక్కువగాను కూడా చదువుకుని సంపాదిస్తూ కూడా, మగాడి చెప్పుకింద తేలులా బతికే ఆడవాళ్ళని ఎందరిని చూడటంలేదూ?" అన్నాను సౌమ్యంగానే.

ఆడపిల్ల మహాలక్ష్మి అంటూనే, చదువు–పెళ్ళి దగ్గరకొచ్చేసరికి పెద్దవాళ్ళెంత నియంతృత్వం వహిస్తారో, ఎలా ఆడపిల్ల మెడలు వంచి తమమాటే నెగ్గాలని భావిస్తారో చూసాక, తల్లిదండ్రులు ఆడపిల్లమీద చూపించే ప్రేమ చాలా కృతకంగా, తెచ్చిపెట్టుకున్నదిగా కనిపించింది. నన్ను వదిలించుకుంటేనేగానీ కంటికి కునుకు పట్టదట! నా పెళ్ళయి మొగుడింటికి పోయేదాకా నేను గుండెలమీద కుంపటినట!




ఎందుకు కంటారో ఈ కుంపట్లని! లక్ష రూపాయలు తాంబూలంలో పెట్టి ఈ కుంపటిని మరొకడి నెత్తికి ట్రాన్స్‌ఫర్ చెయ్యడం ఎందుకు? తలా మొలా తాకట్టుపెట్టి అన్నయ్యని ఎం.కాం. చదివించిన అమ్మా, నాన్న నన్ను గ్రాడ్యుయేట్‌ని చెయ్యడమే నేరం అని బాధపడిపోతున్నారు!

చదువు మగాడి జన్మహక్కు-ఆడపిల్లకి దయా ధర్మ బిక్ష!

జీవిత వైకుంఠపాళీలో మగాడు నిచ్చెన-కాసుల మూట తెస్తాడు!

ఆడపిల్ల పాము-కూడబెట్టిన మూటని మింగు తుంది!

మగాడు తనకి నచ్చిన పిల్లని చేసుకోవడం మగతనం-ఆడపిల్ల తనకి నచ్చిన వాడ్ని చేసుకుం టాననడం బరితెగింపుతనం!

"మా అమ్మాయి వంచిన తల ఎత్తదు, మామాటే దానికి వేదవాక్కు" అని తల్లిదండ్రులు గర్వంగా చెప్పకోడానికి వీలుగా ఆడపిల్ల తన వ్యక్తిత్వాన్నే చంపు కోవాలని అర్థమయ్యాక మనుషులమధ్య ఉండే అనుబంధాలు ఎంత బోలువో చూసాకా, తల్లిదం డ్రులు, అన్నా వదినల మధ్య నిలబడ్డ నాకు వాళ్ళె వరో ముక్కూ ముఖం ఎరగని అపరిచితుల్లా కని పించి ఆశ్చర్యపోయాను. నిక్షేపంలాంటి సంబంధం (?) కాదన్నందుకు పగబట్టినట్టు ఇంట్లో అందరూ నాతో మాట్లాడటం మానేశారు. ఆలోచనల్తో ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు.

మగవాడుగా చదువుకునే అవకాశాలున్నందువల్ల నాకన్నా ఎక్కువ చదువుకుని, ఎక్కువ సంపాది స్తున్న వాడ్ని, సంపాదించుకుంటూ కూడా ఇతరుల సొమ్ముకి కక్కుర్తిపడి అమ్ముడు పోయేవాడ్ని కట్టుకుని, అతగాడికి సబార్డినేట్‌గా, అతగాడింట్లో రెండో తరగతి సిటిజన్‌లా బ్రతకడం అంటే మన బ్రతుకుల్ని మనమే కుంచించుకోవడం, మన చేతు లకి మనమే సంకెళ్ళు బిగించుకోవడం, మన నోళ్ళని మనమే కుట్టేసుకోవడం, మన ఉనికిని, వ్యక్తిత్వాన్నీ మనమే అపహాస్యం చేసుకోవడం అని పించింది.

పెళ్ళి విషయం వచ్చేసరికి ఆడపిల్ల-తనకంటే విద్యాధికుడ్నీ, తెలివైన (?) వాడినీ, తనని శాసించి పాలించగలిగితే వాడినీ కావాలని కోరు కోవడమే స్వయం పతనానికి తొలి మెట్టు కాదూ? స్త్రీ అనాలోచితంగా, అసంకల్పితంగా మగాడికిచ్చే ఆధిక్యతే కాదూ మగాడి బలం?

మగవాడికి లేని ఆధిక్యతని అంటగట్టి, అత గాడికి కట్టబెట్టిన కృత్రిమ ఆధిక్యతా విషవల యంలో తానొక బందీలా జీవించే పరిస్థితిని ఆడపిల్ల ఎందుకు కోరుకోవాలి? మగాడికిచ్చిన ఆధిక్యత తను అంటగట్టిందే-దాన్ని తనెప్పడైనా ఉపసంహరించుకోవచ్చనే ఊహ ఆడపిల్లకి కలిగిన మరుక్షణం మగాడి ఆధిక్యత మంచుగడ్డలా కరిగి నీరైపోదూ? జంటలో మగవాడు ఆడదానికంటే అన్నివిధాలా అధికుడై ఉండాలనే సంప్రదాయపు విషవుటుచ్చులలో ఆడపిల్లలు బయటపడకపోతే వాళ్ళ జీవితాలకి ఏనాడైనా విముక్తి ఉంటుందా?

ఆడపిల్ల-తనకన్నా తక్కువ చదువుకున్నా, తక్కువ సంపాదనాపరుడైనా, తక్కువ హోదాయే

ఉన్నా- అమ్ముడుపోనివాడ్ని, ఆత్మాభిమానం ఉన్న వాడ్ని, వ్యక్తిత్వపు వెన్నెముక ఉన్నవాడ్ని చేసుకుంటే ఏవిటి తప్పు? ఒక ఆడ-మగ ఆనందంగా, సుఖంగా జీవించడానికి కావలసిన అర్హతలు పర స్పర విశ్వాసం, ప్రేమానురాగాలు ఇచ్చిపుచ్చుకో వడం కాదూ?

డిగ్రీలు, జీతాలు, హోదాలూ ఇచ్చే కృత్రిమ ఆధిక్యతా జబ్బుతో బాధపడే మగాడ్ని చేసుకుని జీవితాంతం బానిసలా బతికేకన్నా-ఆ డిగ్రీలు, హోదాలు లేని సామాన్యుడితో ఆనందంగా జీవిం చలేమా?

- ఇలా ఆలోచిస్తున్నపుడే పాల్ గుర్తొచ్చాడు. గుర్తున్నాడా పాల్? మనం చదివిన కాలేజీ లైబ్ర రీలో అటెండర్. కుటుంబ బరువు బాధ్యతలు నెత్తికెత్తుకోవడం కోసం చదువుమానేసి అటెండర్ గా చేరిన పాల్. మనం అలా ప్రతిజ్ఞ చేసినపుడు ముందుకొచ్చి మనల్ని అభినందించిన బహుకొద్ది మందిలో మొదటివాడు. తెలివితేటలు, సభ్యతా సంస్కారాలు పుష్కలంగా ఉన్నా, చేసేది అటెం డర్ అనబడే తక్కువ స్థాయి ఉద్యోగం కావడవల్ల అందరిచేతా తక్కువగా చూడబడేవాడు. ఏ రిఫ రెన్స్‌బుక్ ఎక్కడ ఉంటుందో అతనికి తెలిసినట్టు లైబ్రేరియన్‌కి కూడా తెలియదు. ఆ రాత్రంతా ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాను.

మర్నాడు అతన్ని వెదుక్కుంటూ వెళ్ళాను. అతని పుడు అటెండర్‌కాదు-రికార్డ్ అసిస్టెంట్. అయినా సాంఘిక హోదాలో అటెండర్‌గానే లెక్క. తన కోసం వెదుక్కుంటూ వచ్చిన నన్ను చూసి ఆశ్చ ర్యపోతూనే గౌరవించాడు.

నా మనసులోని మాటని ఫ్రాంక్‌గా చెప్పాను-" నేను నీకన్నా ఎక్కువ చదువుకున్నదాన్ననీ, ఎక్కువ సంపాదనా పరురాలననే ఆధిక్యతాభావం నాలో ఏమూలా లేదు. నువ్వు నాకన్నా తక్కువ అనే భావమూలేదు. జీవిత భాగస్వామిని సహచరిగా, ఆత్మీయురాలైన మిత్రురాలిగా భావించి గౌరవించే సంస్కారం నీకుందని నమ్ముతున్నాను. నాపట్ల నీకు కూడా అటువంటి భావమూ, నమ్మకమూ ఉంటే నీ హస్తాన్ని అందించు" అన్నాను.

పాల్ మొదట నా ప్రపోజల్‌కి తెల్లబోయినా, మెల్లగా తేరుకుని, చిరునవ్వుతో అపురూపంగా నా చెయ్యి పట్టుకుని చుంబించాడు.

నా నిర్ణయం ఇంట్లో ఒక ఉప్పెననే సృష్టించింది. నాన్న ఎక్కువ మాట్లాడడు. ఇంటి యజమాని సీరియస్‌గా ఉంటూ, తక్కువ మాట్లాడి, ఎక్కువ కంట్రోల్ చెయ్యాలనుకునే మనిషి.

"అసలది గడపదాటినపుడే కంట్రోల్ చెయ్యా ల్సింది. ఇపుడనుకుని ఏంలాభం?" అన్నయ్య నాన్న స్థానాన్ని ఆక్రమిస్తూ అన్నాడు.

కంట్రోల్ చెయ్యాలట-నేనొక అదుపు తప్పిన లారీ అయినట్టు!

"నీ జీవితం ఎలా నడవాలో నువ్వే నిర్ణయించు కోదలిస్తే, అలాగే కానివ్వు-మాకు నువ్వూ లేవు, నీకు మేమూ లేవమకుని చెయ్యి" అంటూ నాన్న లేచక్కా పోయాడు. అమ్మ తిట్లతో దీవిస్తూ వంటింట్లోకి నడిచింది. నన్నో గొంగళిపురుగుని చూసినట్లు చూసింది వదిన.

మండువాలో ఒక్కర్తినీ నిలబడ్డాను.

పుట్టి పెరిగిన ఇల్లు-జన్మనిచ్చిన తల్లిదండ్రులు, అన్నయ్య-వదిన, చెల్లెలు, తమ్ముళ్ళు. కేవలం నా జీవిత భాగస్వామిని నేనే నిర్ణయించుకున్నందుకు వీళ్ళందర్నీ వదులుకోవాలట! మళ్ళీ నా ముఖం చూపకూడదట! తిరిగి గడప తొక్కకూడదట!

బ్లాక్ మెయిల్!

కథల్లో, సినిమాల్లో విలన్ బ్లాక్ మెయిల్ చేస్తాడు-బెదిరించి లొంగదీసుకునేందుకు.

ఇపుడు జరుగుతూన్న దేమిటి? కన్నతల్లిదం డ్రులే బ్లాక్‌మెయిల్ చెయ్యటం!

వాళ్ళు చెప్పినవాడిని-వాళ్ళు కొనగలిగే రేటుకి అందుబాటులో ఉన్నవాడిని-సిగ్గెగ్గులు లేకుండా పశువులా అమ్ముడు బోయేవాడిని-నా ఇష్టాయి ష్టాలతో నిమిత్తం లేకుండా, నా ఆదర్శాలతో సంబంధం లేకుండా అంగీకరించాలి!

అతనూ, అతని వ్యక్తిత్వం నాకు నచ్చడం ముఖ్యం కాదు!


అతగాడికి నేను నచ్చడం ముఖ్యం!

అతగాడితో పడుకుని, అతనికి పిల్లల్ని కని, అత నింట్లో వెట్టి చాకిరీ చేసే దాసీది మరి అతనికి నచ్చొద్దా?

నాతో జీవితం పంచుకునేవాడు, నా పిల్లలకి తండ్రయేవాడు నాకు నచ్చకపోయినా ఫరవాలేదు.

అసలు మొగుడనేవాడు దొరికినందుకే సంతోషిం చాలి కాబోలు!

పెళ్ళికి ముందే సెక్స్ అనుభవంకోసం వెంపర్లాడి పోతూ, నైతిక విలువల స్పృహే లేకుండా, డబ్బిచ్చి సానికొంపలచుట్టూ తిరిగే మగాడు-కోటి కోర్కె లతో ఓ కన్నెపిల్ల తనని తాను అర్పించుకోడానికి సిద్ధమైతే "ఏమిస్తావ్?" అనడిగే వాడికి నన్ను నేనెలా సమర్పించుకోగలను? అటువంటి మగాడి స్పర్శకన్నా జుగుప్స కలిగించే దేముంటుంది?



అయినా ఇష్టాయిష్టాలూ, వాంఛలూ మగాడి సొత్తు, హక్కు!

ఆశయాల్ని, ఆకాంక్షల్ని ఉరేసుకుని నిర్లిప్తంగా మెడ వంచడం ఆడపిల్ల విధి!

-'మంచిపిల్ల, బుద్ధిమంతురాలు, పెద్దలమాట జవదాటదు' అనే పేరు కావాలా?-'సర్వ స్వతం త్రురాలు, స్వేచ్ఛా విహారిణి' అనే పేరు కావాలా?

అమ్ముడు పోతేయేం, మంచి ఉద్యోగం, సాంఘిక హోదా, గౌరవం, ఉన్న మొగుడు, అన్నా వదినల, అక్కా బావల, చుట్టాల పలకరింపులూ, మర్యా దలూ కావాలా లేక ఆత్మ గౌరవం, వ్యక్తిత్వం మాత్రమే ఆస్తిగా వుండి, కుహనా లోకం ఇచ్చే సాంఘిక గౌరవాలకీ, మర్యాదలకీ నోచుకోని మగ వాడు పాల్‌తో జీవితం కావాలా?

ఈ రెండు బాటల్లో నేనెంచుకోవల్సిన బాట ఏది?

నా వివేకం ఆత్మ గౌరవానికే-పాల్‌తో జీవితానికే ఓటేసింది.

కన్న తల్లిదండ్రుల్ని నేను కాలదన్నుకోవడం లేదు. నా జీవితాన్ని నేను నిర్దేశించుకునే స్వేచ్ఛని కాల రాసే తల్లిదండ్రుల్ని, అన్నదమ్ముల్ని ప్రక్కకు తీసి పెట్టక తప్పలేదు.

ఇంట్లో అందర్నీ పిల్చాను-నా నిర్ణయం మార దని చెప్పాను.

అమ్మ ముక్కు చీదుతూ ఆరున్నొక్క రాగం అందుకుంది-నావల్ల పరువు (?) పోతుందట! నాన్న స్థిత ప్రజ్ఞుడిలా కుర్చీ కతుక్కుని చూస్తుం డిపోయాడు.

అన్నా వదినల ముఖంలో ఆనందం తళుక్కున మెరిసింది-లక్షన్నర రూపాయల ఖర్చు తప్పినందుకు. ఆ మేరకి వాళ్ళకి కలిసివచ్చినట్టేగా. కానీ పైకి నిరసన నటించాలి కాబట్టి నటిస్తున్నారు.

నటన!

భార్యా భర్తల మధ్య; తల్లిదండ్రులు-పిల్లల మధ్య; తోడబుట్టిన వాళ్ళ మధ్య నటనలు! జీవిత మంతా హిపోక్రసే! ఆత్మవంచన, పరవంచన-ని జాయితీ లోపించిన బతుకులు! నటన లేకుండా కొద్దో గొప్పో బాధ మిళితమై వున్నది అమ్మకే-కడుపు తీసికదూ! పేగు సంబంధం-మమకారం పంచి ఇచ్చిన మాతృమూర్తికదూ.

అయినాసరే-బానిసల్ని అదుపులో పెట్టేందుకు శిక్షణ ఇవ్వబడ్డ పెద్ద బానిస ఆమె. నాన్నతోబాటు అన్నయ్యతోబాటు నా స్వేచ్ఛని పీకమలిమేసేటం దుకు ప్రయత్నించే అమ్మని చూసి నాకు కోపం, బాధ, జాలి ముప్పేటలా ఉబికి వచ్చాయి. అమ్మ ఒడిలో తలదూర్చి ఏవేవో చెప్పాలనిపించి, తమా యించుకున్నాను.

"నేను వెడుతున్నాను-మళ్ళా వెనక్కి వస్తానని భయపడకండి" అంటూ గుమ్మం దాటాను. పుట్టి పెరిగిన ఇంటితో ఇరవై నాలుగేళ్ళ అనుబంధం

వుటుక్కున తెగిపోయింది. నిజాయితీ లోపించిన మానవ సంబంధాలు ఎంత బలహీనమైనవి!

"...గడప దాటగానే సరికాదు, వాడి మోజు తీరగానే కుక్కలు చింపిన విస్తరిలా తిరిగొస్తావ్! గడప దాటిన ఆడపిల్లకి రక్షణ లేదు" అంటూ తల్లిలాటి వదిన దీవించింది!

గడప దాటిన ఆడపిల్లకి "రక్షణ" లేదట!

పోనీ గడప దాటని ఆడపిల్లకి రక్షణ ఉందా?

"ఆడపిల్లవి-మగాడిలా ఆ పెత్తనాలేవిటి, వీథులు పట్టుకుని తిరగడం ఏవిటి?" అంటూ నాలుగు బాది మూలన కూర్చోపెట్టే తల్లిదండ్రుల నుంచీ ఆడపిల్లలకి రక్షణ ఉందా?

"అన్నయ్యతో సమానంగా చదవాలంటే ఎలా కుదురుతుంది? ఇంకా చదివితే ఇంకా ఎక్కువ కట్నం ఎక్కడి నుంచి తేగలం? చదివింది చాలు-పెళ్ళయేదాకా ఇంట్లోనే యేడు!" అంటూ ఆత్మన్యూనతకి గురిచేసే తల్లిదండ్రుల నుండి ఆడపిల్లకి రక్షణ ఉందా? మనిషికి పుట్టుకతో వచ్చిన స్వేచ్ఛని హరించి, కట్టడిలో పెట్టి, ఆడపిల్ల ఆత్మవిశ్వాసాన్ని అడుగడుగునా ఖూనీ చేసే కుటుంబ సభ్యులనుండి, పెద్దల నుంచి ఆడపిల్లకి రక్షణ ఉందా?

ఆడపిల్ల నెత్తిన కుటుంబం రుద్దే ఈ కుక్కపాట్లకేనా ముద్దుగా 'రక్షణ' అని పేరు పెట్టి, ఆడపిల్ల స్వతంత్రించి బయటకు వెడితే ఈ రక్షణేనా ఉండదని బెదిరిస్తున్నారు? మగాడి నెత్తిమీద ఈ రక్షణ రుద్దరేం? ఈ రక్షణ ఒక్క ఆడపిల్లకే కావాలా? ఇదే కుటుంబం ఆడపిల్లకిచ్చే రక్షణ ఐతే- ఆ రక్షణే ఆడపిల్ల పాలిటి పరమ శత్రువు! ఆ రక్షణ వలయం ఛేదించుకుని బయటపడి తన బతుకు బతకడవే ఆడపిల్ల జీవిత ధ్యేయం కావాలి.

అలా అన్నందుకే అన్నయ్య నాపై చేయెత్తాడు! పశువులు కూడా చెయ్యలేనిపని-మగాడు మాత్రమే చేయగలిగే అతి సులువైన, అతి జుగుప్సాకరమైన పని ఆడదానిమీద చేయిచేసుకోవడమేగా. మగాడికి ఎవరిచ్చారీ హక్కు? అన్నయ్యపై నేను చేయెత్తడం ఊహించగలరా?

నా మంచేదో, చెడేదో నాకు తెలీదట! ఆడపిల్లకి పాతికేళ్ళు వస్తున్నా, స్వంత నిర్ణయాలు తీసుకోలేనివిధంగా, తన కాళ్ళమీద తను నిలబడలేని విధంగా పెంచిన వాళ్ళది కాదూ నేరం?

నేను నిర్ణయించుకున్నవాడు నన్నుద్ధరిస్తాడని గ్యారంటీ ఏముందన్నారు.

డిమాండ్ చేసిన కట్నం ఇచ్చి కొనుక్కున్నా, ఆత్మ గౌరవం లేకుండా అమ్ముడు పోయిన ఆ మనిషి నిన్ను గౌరవంగా ట్రీట్ చేస్తాడని గ్యారంటీ వుందా?

ఇచ్చిన కట్న కానుకలు సరిపోలేదని పీడించడనీ, రెండోసారి కట్నం కోసం నిన్ను సజీవ దహనం చెయ్యడనీ గ్యారంటీ వుందా?

నిన్ను అనునిత్యం కించపరుస్తూ, నీ పెట్టి వీథిలోకి గిరవాటేసి, నీ దిక్కున్న చోటికి పొమ్మంటూ గెంటెయ్యడని గ్యారంటీ ఉందా?

అడిగిన కట్నం ముఖాన పారేసి మొగుళ్ళని కొనుక్కుని ఎంతమంది నిక్షేపంలా కాపురాలు చేసుకోవడం. లేదూ-ఎందుకొచ్చిన ఆదర్శాలంటావా?

నిజమే-సిగ్గు, అభిమానం, పౌరుషం చంపుకుని-అతగాడు తిట్టినా, తన్నినా, పడి, గెంటేస్తే-ఎక్కడికి పోను? అంటూ ఏడ్చి కాళ్ళు పట్టుకుని ఒదిగిపోయి నిక్షేపంలా బ్రతికేయచ్చు. మాష్టర్ డిగ్రీలు, రిసెర్చి డిగ్రీలు చేసికూడా, వ్యక్తిత్వం, ఆత్మగౌరవం లేని ఈ మగాళ్ళు ఒక్కొక్కడూ ఒకో మేడిపండు.

అటువంటిది-కష్టపడకుండా వచ్చే పరాయి సొమ్ము మీద ఆశ, వ్యక్తిత్వవిహీనత, కుసంస్కారం అనే విషపు క్రిములతో లుకలుకలాడే ఈ మేడిపళ్ళని ఆడపిల్లలు డబ్బిచ్చి కొనుక్కోవడం బుద్ధిలేనితనానికి, ఆత్మ విధ్వంసానికి నిదర్శనం కాదూ? నా చదవు, అది నాకిచ్చిన ఆలోచన, వ్యక్తిత్వం ఆత్మగౌరవం నన్ను మామూలుగా ఆలోచించనీయవు, అందరిలా బ్రతకనీయవు. ఇంక లోకం సంగతంటావా? సమాజ సంస్కరణాభిలాషతో సంఘాన్ని ధిక్కరించి, ఆత్మవిశ్వాసంతో ముందడుగువేసే ఎవరిమీద బురద చల్లకుండా వదిలిందీలోకం?

నా వాళ్ళ దృష్టిలో నేను చేసుకున్నది పెళ్ళి కాదు-ఒళ్ళుకొవ్వి, మదమెక్కి లేచిపోవడం! బయట ప్రపంచంలో, ఆఫీసులో, బజారులో-"అటెండర్ గారి పెళ్ళాం" అంటూ వెటకారాలు, అవహేళనలు అయినా అవేమీ నన్ను తాకవు, బాధించవు.

ఆడది తనకి తానే ఒక రక్షణ కవచం కాకపోతే-అడుగడుగునా ఎదురయ్యే అణచివేత, అవమానాల నుండి ఎవరూ రక్షించలేరు.

స్వేచ్ఛకోసం, స్వేచ్ఛ ఇచ్చే నూతన ప్రాణ వాయువుకోసం, స్వేచ్ఛా సమానత్వాల కొత్త విలువలపై ఆధారపడే ప్రేమ, ఆత్మీయతలకోసం నా జీవితాన్నే ప్రయోగం చేస్తూ నూతనతరం స్త్రీగా నన్ను నేను ఆవిష్కరించుకోవడంలోవున్న ఆనందం, తృప్తి ముందు ఈ క్షుద్రలోకం నాపై విసిరే ముళ్ళూ, చల్లే బురద ఏపాటిది? నాకోసం ఈ ప్రపంచం మారకపోతే ఈ ప్రపంచాన్నే నాకోసం మార్చుకుంటాను.

స్వేచ్ఛ నీ జీవిత ధ్యేయమైతే, స్వేచ్ఛాగానం నీ జీవన సంగీతమైతే, దాన్ని నీ నుండి ఎవరూ లాక్కోలేరు. ఆత్మాభిమానంతో కూడిన రెబల్‌గా, స్వేచ్ఛా విహంగంగా జీవిస్తావో-సంప్రదాయపు సంకెళ్ళు ఇచ్చే సెక్యూరిటీలో బందీగా బతుకుతావో-ఆ ఛాయిస్ నీదే.



ఉంటానే మరి
నీ
సహజ

నేల పొరల్లోంచి పుట్టిన
మెరుపు తీగను నేను
మట్టిపాదాల మహా
కదలికను నేను
నా పేరు ఆకలి
నా పేరు ఆత్మగౌరవం

మీ వర్ణధర్మాలకు బానిసనయ్యాను
మీ కర్మ ప్రచారాలకు బలినయ్యాను
మీ దయ్యాల వేదాలు వింటె
మా చెవుల్లో సీసం పోశారు
మా పాదముద్రలు పడకుండా
మా వీపుకు చీపురు కట్టారు

చీటలెత్తిన కడుపు బీల్ల నుంచి
నెర్రెలిడిసిన నల్లరేగల్ల నుంచి
మనుధర్మాన్ని మట్టుపెట్టేందుకు
డప్పుల దండోరాతో వస్తున్నాం

మేం శ్రమజీవులం - మనుషులం
నేను స్వేదబిందువుల ముత్యపు మెరుపును
నేను శ్రమజీవుల చెమట పరిమళాన్ని
నిన్నటి కారంచేడు ఎలీషమ్మను నేనే
మొన్నటి కంచికచర్ల కోటేశునూ నేనే
నేటి సజ్జలగూడెం మహదేవమ్మను
సేలంలో కన్ను పోగొట్టుకున్న ధనంను నేనే
చుండూరు నీరుకొండ నా ఊరు
ఇంద్రవెళ్ళి నా పాలవెల్లి
నేను
మాదిగ డప్పు మోతను
నేను మండుతున్న కమ్మరి కొలిమిని
నేను గిరగిర తిరిగే కుమ్మరి సారెను
ధగధగ మెరుస్తున్న మంగలి కత్తిని
నేను జాలరి వలను, సాలెల మగ్గాన్ని
గొండు గిరిజనుల తుడుంమోతను
నేను గొల్లకురుమల గొంగలి పాయను
నేను
విస్తృతమవుతున్న దళిత ఉద్యమాన్ని
సమస్త వృత్తుల ఆత్మగౌరవాన్ని
మీ చాతర్వర్ణమనుధర్మాన్ని
మీ రంకుబొంకు పురాణాల బంకను
ఆధునిక అంటరానితనాన్ని
తెగనరికేందుకు
మా డప్పులు ఎరుపెక్కుతున్నయ్
ఇది
మట్టి పాదాల మహాకదలిక-

\- అన్నవరం దేవేందర్